


# దా 'ఋణం'

ఎలక్ట్రాన్

**గృహస్థ ధర్మం నిర్వహిస్తూనే పాతికేళ్ళ వయసు నుంచి ముప్ఫై అయిదేళ్ళ వయసు వరకూ ప్రతి నిత్యం సంధ్యాసమయంలో కఠోర తపస్సు చేసిన గౌరీశంకర్ ముందు దేవుడు ప్రత్యక్షమయ్యాడు. సూర్యాస్తమయ సమయంలో, పెరట్లో నేరేడు చెట్టు కింద ప్లాస్టిక్ కుర్చీలో కూర్చుని మౌన తపం చేసుకొంటున్న గౌరీశంకర్, పట్టువస్త్రాల గరగరలు విని కళ్ళు తెరిచాడు.** ఎదురుగా నిల్చున్న స్వామిని చూశాడు. దిగ్గున లేచి స్వామిని కుర్చీలో కూర్చోబెట్టి, ముందుగా ఒంటిపాదం మీదా, తర్వాత రెండు మోకాళ్ళమీదా నిలబడి, చివరగా సాష్టాంగ పడి త్రివిధ నమస్కారాలు చేశాడు. లేచి నిలబడి అంజలి ఘటించాడు.

"ఇంతవరకూ ఏ భక్తుడూ నన్ను కూర్చోమన లేదు. నిలబడే వరాలిచ్చాను. ఇప్పుడు నువ్వు చేసిన మర్యాదకు చాలా సంతోషించాను. ఏం కావాలో కోరుకో" అన్నాడు దేవుడు.

"అప్పులు చేసి ఎగ్గొట్టే శక్తి ప్రసాదించు" అన్నాడు గౌరీశంకర్.

"ఇన్నేళ్ళ తపస్సూ ఇందుకా? కలియుగంలో జీవిస్తున్నవాడివి, తపస్సుతో నిమిత్తం లేకుండానే ఉగ్గుపాలతో ఈ గుణం అబ్బి ఉండాలే? నీ నుదుటి రాతలో ఏదో స్పెల్లింగ్ మిస్టేక్ వచ్చుండాలి" అన్నాడు స్వామి చిరునవ్వు నవ్వుతూ.

"మీరు సరిగ్గా ఊహించారు. హరిశ్చంద్ర మహారాజు విశ్వామిత్రుడి బాకీ చెల్లించడం కోసం భార్యాసుతుల వియోగం భరించాడు. వేంకటేశ్వర స్వామి తన కల్యాణం కోసం చేసిన ఋణాన్నింకా కుబేరుడికి చక్రవడ్డీతోసహా చెల్లిస్తూనే ఉన్నాడు. బుద్ధుడు, గాంధీ పుట్టిన దేశంలో పుట్టినవాణ్ణి. అప్పుచేసి ఎగ్గొట్టరాదన్న ధర్మచింతన అడ్డొస్తోంది. అదీగాక, అప్పిచ్చే నాథుడు కనబడుటలేదు."

"పే స్లిప్ చూపిస్తే ఇంటికొచ్చి అప్పులిచ్చే బ్యాంకులు కొల్లలు. నీకు అప్పు దొరకటం లేదంటే వింతగా ఉంది."

"ఆయనే ఉంటే మంగలెందుకన్నట్టుగా ఉద్యోగమే ఉంటే ఈ గొడవంతా ఎందుకు? అయినా ఉద్యోగం పే స్లిప్ మీద ఇచ్చే అప్పులు గృహనిర్మాణానికీ, గృహావసర వస్తువుల కొనుగోళ్ళకీ తప్ప గృహస్థ ధర్మంలో పుట్టిన పిల్లల పంపకాలకీ, పెళ్ళిళ్ళకీ కాదు కదా? శుభకార్యాలకివ్వరు కదా?"

"పిల్లల వివాహాలకి ప్రావిడెంట్ ఫండ్లోంచి అప్పులిస్తారు కదా?" స్వామి ప్రశ్నించాడు.

"ఇస్తారు. కానీ అవి పెళ్ళి భోజనాలక్కూడా సరిపోవు. ఇంక కట్నాలెక్కణ్ణుంచి తీసుకొచ్చేది?"

"అంతా అప్పంటే ఎలా? కొంతైనా పొదుపు చెయ్యాలి. ప్రభుత్వం వారి ఎన్నో పొదుపు పథకాలున్నాయి. వాటి వైపు దృష్టి సారించలేదా?"

"స్వామీ మీరు సర్వజ్ఞులు. ఆదాయమనేది ఉంటేనే కదా పొదుపు ప్రసక్తి వచ్చేది? అది లేనివాడికి అప్పే గతి మరి."

"కొన్ని సుఖాల్ని త్యాగం చేసి, ప్రయాస పడి కూడబెట్టిన సొమ్ముని ఋణదాత నీకు అప్పుగా యిస్తాడు. లేదా అతగాడు తన జీవనభృతికోసం వడ్డీ వ్యాపారమే కొనసాగిస్తున్నాడనుకొందాం. ఆ కారణంగా తీసుకున్న ఋణాన్ని తీర్చవలసిన నైతిక బాధ్యత నీదే. అయినా ఉద్యోగం లేకుండా పెళ్ళెందుకు చేసుకున్నావ్? పిల్లల్నెందుకు కన్నావ్?"

"ఉద్యోగం లేదని వయసూరుకోదు కదా స్వామీ? మనవల పెళ్ళిళ్ళు జరగందే మూలనున్న ముసలమ్మల మనసూరుకోదు. పై సంబంధాలకి పోయే స్తోమతలేని కారణంగా నా మేనమామ ఏదో నన్నుద్ధరిస్తున్నట్టు వయసొచ్చిన తన కూతుర్నిచ్చి కట్టబెట్టేశాడు."

"మరింతకాలమూ సంసారాన్నెలా సాగించావ్?"

"తాతలు సంపాదించిన ఎకరాల్ని తాతా, నాన్నా వారివారి తరాల్లో కొంత కొంతగా హారతి వెలిగించేశారు నా చదువుల కోసం, అక్క పెళ్ళికోసం మరింత హరించుకుపోయాయి. రెండు డిగ్రీలు చేతికంది, నాలుగుసార్లు ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణుణ్ణయినా ప్రభుత్వం దగ్గర్నుంచి నియామకం ఉత్తర్వులు రాలేదు. ఒకటి జీతం చూపించి పావు చేతిలో పెట్టే రెండు స్కూళ్ళలో ఉద్యోగం చేసి, మనసొప్పక వాటిని వదిలేశాను. ఉన్న రెండెకరాల్లోనూ వ్యవసాయం మొదలుపెట్టాను. వర్షాలు పడక, నీటిపారుదల సౌకర్యాలు లేక వ్యవసాయం కొండెక్కింది. చదువుకున్నంత మాత్రాన నీరు లేకుండా వ్యవసాయం సాగుతుందా ఏమిటి? ఋణాలిచ్చిన బ్యాంకులవాళ్ళు వేలం పాట పాడేశారు. ఇదుగో, ఈ యిల్లు కూడా తాకట్టుపెట్టి డబ్బు తీసుకొచ్చాను. మరో రెండు నెలల్లో ఆ సొమ్మూ అయిపోతుంది. పైసా వచ్చే అస్కారం లేదు. ఇంటి రుణం తీరే మార్గం లేదు. అందుకనే డిగ్రీలు చేతికంది, ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టినరోజు నుంచీ భవిష్యత్తు గురించి బెంగతో నిన్ను ధ్యానిస్తూనే వచ్చాను."

"గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారమంటే

**(మిగతా 46 వ పేజీలో చూడండి)**



## 'దా' ఋణం కథ

(38వ పేజీ తరువాయి)

ఎలా? స్వయం ఉపాధి పథకాలెన్నో ఉండగా ప్రయత్నించకపోతే ఎలా?"

"స్వయం ఉపాధి పథకాలా? అవెలా ఉంటాయి? వ్యవసాయం చేసి చేతులు కాల్చుకున్నాను కదా?"

'రాజకీయాల్లో చేరడం – అధో జగత్‌లో చేరి ప్రముఖుల్ని బెదిరించీ, అపహరించీ డబ్బు గుంజడం సెటిల్‌మెంట్ వ్యవహారాలు నడపడం, దళారీ వ్యాపారం చెయ్యడం, ఆఖరుగా బిచ్చమెత్తుకోవడం యివన్నీ లేవూ?"

"ఉన్నాయి. కానీ చదువెందుకుమరి? ఎమ్.ఏ.,బి.యిడి. పాసయ్యాను. తగిన ఉద్యోగం రాలేదు. వచ్చిన ఉద్యోగానికి తగిన జీతం యివ్వలేదు వాళ్ళు. వ్యవసాయం చేశాను. వర్షం సంగతటుంచినా, గట్టు మీద నిల్చుని బూతులు తిట్టే కుసంస్కారం లేని కారణంగా, కూలిజనం ఒక రోజు పని రెండు రోజులు చేసి ఖర్చు రెండింతలు పెంచారు. ఓసారి చదువంటూ చదివిన తర్వాత, మీరు చెప్పిన పనులు చెయ్యడానికి అభిరుచీ, సంస్కారమూ అనేవి అడ్డొస్తాయి."

"అన్నీ కాకపోయినా కొన్ని నువ్వు నిర్దేశించుకున్న యుగవిరుద్ధ ధర్మాలు, ఉద్యోగస్థులందరూ చదువుకున్నవారే అయినా అవినీతి రాజ్యమేలుతోంది. వారికి లేని సంస్కార చింతన నీకెందుకు? మెకానికల్ ఇంజనీరు నీళ్ళ గొట్టాలు రిపేరు చేసే రోజులూ, సివిల్ ఇంజనీర్ టీవీ రిపేరు చేసే రోజులూ వచ్చేశాయి. బోడి ఎమ్.ఏ.,బి.ఇడి. వాడివి నీకు దర్పముండ కూడదు."

"ధర్మం ఒంటి పాదం మీదైనా నడవడానికి, కనీసం నాలాంటివారుండాలి కదా?"

"అటువంటప్పుడు అప్పుచేసి ఎగ్గొట్టే శక్తి కావాలని ఎందుకడగడం?"

"హరిశ్చంద్రుడు చేసిన అప్పు తీరుస్తానని నిజం చెబ్తూనే వచ్చాడు. నేను తీసుకున్న అప్పుని చెల్లించనని నిజం చెప్పాలనుకుంటున్నాను. నేను కుంటి ధర్మం నిర్వహించినప్పుడే కదా యుగ ధర్మం కూడా కుంటినడక నడుస్తుంది."

"తిరిగి యిస్తానన్న హామీ యివ్వందే అప్పెవరిస్తారు? నీ కోరిక తీర్చడం చాలా కష్టం."

"కష్టం కావొచ్చు కానీ అసాధ్యం మట్టుకు కాదు. గొప్పవారి అవసరాలను గుర్తించి, వారి మెప్పు పొందడం కోసం అడక్కుండానే అప్పులిచ్చే వాళ్ళు లేరనా? సహకార బ్యాంకులూ, రాష్ట్రీయ బ్యాంకులూ ఎందరో పారిశ్రామికవేత్తలకి రుణాలివ్వడం, వాళ్ళు బోర్డులు తిప్పేయడం జరగడం లేదా? బడుగువర్గాలవాళ్ళు బర్రెల కోసం చేసిన అప్పుల్ని రాజకీయ లబ్ధికోసం పార్టీ నాయకులు రద్దు చేయిస్తారు. మధ్యతరగతివాళ్ళకి కూడా ఈ వెసులుబాటు లేకపోతే ఎలా?"

"గొప్పవాళ్ళు తిరిగి యిస్తారన్న భరోసాకొద్దీ కొందరు తెలివితక్కువ పన్లు చేస్తారు. నీలాంటి వాడు కనీసం యిస్తానన్న మాటైనా అని, నమ్మకం కలిగించకపోతే అప్పెవరిస్తారు? కావాలంటే శమంతకమణిలాంటి సాధనాన్నిస్తాను వరం కోరుకో."

"రోజుకిరవై బారువుల బంగారమిచ్చే ఆ మణా? అది శ్రీకృష్ణపరమాత్మ దగ్గర్నుంచి మీకెలా వచ్చింది?"

"నేనవతారపురుషుణ్ణన్న సంగతి విస్మరించినట్టున్నావ్? అయితే శమంతకమణి కూడా కాల ప్రభావం చేత రూపమూ, గుణమూ మార్చుకుంది."

"అర్థమయ్యేటట్టు వివరించండి స్వామీ."

"శమంతకమణి ఇప్పుడు కరెన్సీ ముద్రించే యంత్రం. నువ్వింట్లో కూర్చుని ఎంత డబ్బు కావాలంటే అంత సృష్టించుకోవచ్చు."

"దొంగనోట్ల చలామణీ, దొంగతనంలాంటి వ్యవహారాలు నాకు నచ్చవు."

"అప్పుచేసి ఎగ్గొట్టడమూ అంతే కదా? నైతికంగా అన్నీ ఒకటే మరి."

"కావొచ్చు. పిడికిలితో గుద్దినవాణ్ణి వేలుతో పొడవడం నా అభిమతం కాదు. పిడికిలితోనే వాణ్ణి గుద్ది కొట్టాలి. ఋణాలవల్ల హరించుకుపోయిన ఆస్తుల్ని ఋణాలతోటే తిరిగి సంపాదించుకోవాలి. నా జీవితలక్ష్యమదే, గమ్యమదే."

"గమ్యమన్నా, లక్ష్యమన్నా ఒకటే. నువ్వు తెలుగుని మర్చిపోతున్నావ్."

"కావొచ్చు. కానీ అవి తెలుగు పదాలు కావు. తత్సమాలు. నా పాపానికి నిష్కృతి లేదు, నిష్కృతి లేదు అని డబుల్ ఎంఫసిస్ కోసం ఒకే పదాన్ని రెండుసార్లుపయోగించకుండా, ఒకే విషయమై రెండు పదాల్ని వాడాను. అప్పులద్వారానే, పోయిన ఆస్తుల్ని తిరిగి సంపాదించాలన్నదే నా కోరిక." స్వామితో విన్నవించుకున్నాడు గౌరీశంకర్.

స్వామి ఆలోచనలో పడిపోయాడు. తీరిగ్గా కూర్చోకుండా ఈ భక్తుని ముందు ప్రత్యక్షమయ్యాను. ఈ హిరణ్యాక్ష వరం ఎలా ప్రసాదించేది? అసలూ, వడ్డీ యివ్వనని ముందరే చెప్పేస్తే అప్పెవరిస్తారు? మరికాస్త నచ్చచెప్పాలి, అనుకొంటూ, "నీ మొహం చూసి ఏదో సమ్మోహనాస్త్రంలో పడిపోయి, నీ కండిషన్ల మీద అప్పిచ్చేటట్టు చేసే వరం నీకు ప్రసాదించానే అనుకో, అప్పుడు తీసుకున్న అప్పుకి నిర్వచనం మారిపోతుంది. తిరిగి తీసుకోని రుణాన్ని దానమంటారు కానీ అప్పు అనరు. దానాలు స్వీకరించి నువ్వు ధనవంతుడివైనా నీ ఆశయం నెరవేరనట్టే కదా? కర్మ సిద్ధాంతం ప్రకారం మరుజన్మలో ఈ రుణ దానాల్ని నువ్వు తీర్చవలసి వస్తుంది. ఆ విధంగా కూడా నీ ఆశయం నెరవేరనట్టే. ఆలోచించుకో."

గౌరీశంకర్ ఆలోచించాడు. అప్పులు చేసి, చెప్పి మరీ ఎగ్గొట్టే ఘనత సంపాదించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కుదామనుకున్నాడు అప్పులిచ్చేవాళ్ళ మీద కసి తీర్చుకుందామనుకున్నాడు. "అంటే తిరిగి యిచ్చేస్తానని వాగ్దానం చేసి, యివ్వకుండా ఎగ్గొట్టే అప్పులరావుగా మారమంటావ్? అప్పుడు అసత్యమాడినట్టవుతుంది కదా?"

"అవుతుంది, తప్పదు మరి. అడిగిన వెంటనే అప్పులు లభించే వరం నేను ప్రసాదించినా, ఆస్తులతోబాటు పాపాన్ని కూడా మూట కట్టుకొంటూ పోతావ్. అవి నీకు శాపాలుగా మారుతాయి. శిక్షల్ని విధిస్తాయి. అన్ని శిక్షలూ నరకంలోనే పడ్తాయనుకోకు. కొన్ని ఈ జన్మలోనే, ఈ లోకంలోనే పడ్తాయి. కిరాయి కలెక్షన్ రౌడీలు కాలూ, చెయ్యీ విరిచేస్తారు. సివిల్ కేసులకి కాలం కాదిది. పరువు పోతుంది. రుణవిముక్తి కోసం ఆత్మహత్యని కూడా సాధనంగా వాడుకోవలసి వస్తుంది. ఆలోచించుకో, నీ యిష్టం."

గౌరీశంకర్ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

### త్రిషకు పెళ్ళి!

తెలుగులో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్ త్రిషకు తగిన వరుడికోసం ఆమె తల్లిదండ్రులు అన్వేషణ మొదలు పెట్టినట్లు బోగట్టా! ఆ మధ్య హైద్రాబాద్‌లోని ఓ నగల దుకాణం యజమాని కొడుకుతో త్రిషకు ఎఫైర్ ఉన్నట్లు వార్తలొచ్చిన మాట తెలిసిందే. అయితే, త్రిషవిగా ప్రచారం జరుగుతున్న బాత్రూం క్లిప్పింగ్‌లు బయటపడటంతో త్రిషకి త్వరగానే పెళ్ళి చేసెయ్యాలని ఆమె తల్లిదండ్రులు యోచిస్తున్నట్లు తమిళ పత్రికలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు కుదుర్చుకున్నా పెళ్ళి మాత్రం ఇప్పట్లో ఉండదని త్రిష తల్లి నిర్మాతలకి భరోసా ఇస్తోంది.

"అయితే అప్పులద్వారా ఆస్తుల్ని సంపాదించుకోవడం జరగదంటావు. అంతేనా స్వామీ?"

"అలాగని నేనెప్పుడన్నాను? కేవలం అప్పుల ద్వారానే ఆస్తుల్ని సంపాదించడం కష్టమన్నాను. మొదటిసారి తీసుకున్న అప్పుతో వ్యాపారం చేసి లాభం సంపాదించావనుకో అప్పు తీర్చి, కొత్త రుణం తీసుకొని వ్యాపారాన్ని వృద్ధి చెయ్యి. మరిన్ని లాభాలు సంపాదించు. ఇలా గొలుసు ప్రక్రియతో కొంతకాలం చేసిన తర్వాత నీకింక రుణాల అవసరముండదు. నీ లాభాలే నీకు పెట్టుబడులవుతాయి."

"అంటే నా పురోగతి అంతా ఆ మొదటి అప్పు మీద ఆధారపడి ఉంటుందన్న మాట? అదృష్టం బెడిసికొడ్తే?"

"కాలం కలిసి రాకపోతే దురదృష్టం వెన్నంటితే ఇలాంటి వేదాంతపు కబుర్లు చెప్తే నువ్వు వ్యాపారం చెయ్యలేవు. కొంత రిస్కు తీసుకోవాలి. మదుపు పెట్టి కుదురుగా కూర్చుంటే కుదరదు. పరుగులు తీస్తూ మొదటి యత్నంలోనే లాభాలొచ్చేటట్టు శ్రమించాలి."

"సజావుగా వ్యాపారం చేస్తే లాభాలొస్తాయా?"

"అది సజావుగా అనే పదానికి నువ్విచ్చే అర్థం మీద ఆధారపడి ఉంటుంది. కాలానుగుణ్యమైన భాష్యం చెప్పుకోవాలంటే, కాస్త మోసం, దగా ఉండందే అది సజావైన వ్యాపారం కాదు. చెప్పుకో దగ్గ లాభాలు రావాలంటే ఆ మాత్రం చెయ్యక తప్పదు."

"అలాగైతే మళ్ళీ పాపం మూట కట్టుకోవాలి కదా?"

"కాజ్ అండ్ ఎఫెక్ట్ అంటే కారణమూ, ఫలితమూ అనే శృంఖలం నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు."

"ఎందుకు కాదు? ఈ జగత్తులో జరిగే భౌతిక, రసాయనిక ప్రక్రియలకన్నింటికీ హేతువాదం కారణాలు చెబుతుంది. విజ్ఞానశాస్త్రానికి పునాది హేతువాదమే కదా?"

"అవును, కాదని ఎవరన్నారు?"

"ఈ హేతువాదమే మరణం తర్వాత ఆత్మ లేదు, స్వర్గం లేదు, నరకం లేదు, అసలేమీ లేదు అంటుంది కదా?"

"అంటుంది" స్వామి సందేహిస్తూ ఆగాడు.

"మరణం తర్వాత నరకం గురించి భయం లేనప్పుడు, ప్రస్తుత జీవితకాలంలో స్వర్గసుఖాల కోసం పరుగులెత్తడంలో పాప, పుణ్యాల ప్రసక్తి ఉండకూడదు కదా?"

"మంచీ చెడులని నిర్ణయించి, శిక్షించే సమాజాన్ని ఏర్పరచుకొన్నది మీరే. దానికి భయపడక తప్పించుకొంటే హేతువాదం మీకు బాగా ఉపయోగపడుతుంది. నువ్వు హేతువాదాన్ని ఓ కవచంగా ఉపయోగించాలని చూస్తున్నావు కానీ, నిజానికి నువ్వు హేతువాదివి కావు. నీలో కుహనాతత్వం జీర్ణించుకుపోయింది. లేకపోతే నీ ప్రయత్నాలు నువ్వు చేసుకోక నా కోసం ఎందుకు ధ్యానించావు? అప్పు చేసి ఎగ్గొట్టే ప్రక్రియకి నా ఆమోద ముద్ర కోసం ఎందుకు ప్రయత్నించావు?"

"చేసిన పాపం చెప్తే పోతుందంటారు. చెయ్యబోయే పాపం సంగతి ముందుగానే చెప్తే ఏమిటంట? అందుకే మీ కోసం పదేళ్ళు ధ్యానం చేస్తే ప్రత్యక్షమయ్యారు. నేనడిగిన వరాన్ని ఇవ్వలేని మీరు దేవుడెలా అవుతారు? ఆ కుహనాతత్వం మీలోనూ ఉంది. ఇలా అంటున్నందుకు క్షమించు స్వామీ."

"నీ వితండవాదనకెలా సమాధానం చెప్పను? కష్టపడకుండా రుణాల ద్వారా నీ ఆస్తుల్ని పెంచుకోవాలి. ఆ రుణ భారం నీ మీద పడకూడదు, అంతేగా?

"అంతే స్వామీ" అన్నాడు గౌరీశంకర్ వినయంగా.

"రాష్ట్రానికీ, దేశానికీ కావల్సిన అభివృద్ధి పథకాలనన్నింటినీ రుణాలు చేసే అమలు పరుస్తున్నారు. దేశం రుణగ్రస్తమైన ఆర్థిక వికాసం కేసి పరుగులు తీస్తోంది. తీసుకున్న రుణాల్లోంచే నాయకులూ, అధికారులూ, కాంట్రాక్టర్లూ తమ అదనపు లాభాలు చూసుకుంటున్నారు. వారికి రుణం తీర్చే బాధ్యత లేదు. ఆ బాధ్యత దేశానిది. దేశం ఎలా తీరుస్తుందన్న బెంగ వారికి లేదు. చెప్పు, వీళ్ళలో ఏ అవతారం కావాలో చెప్పు. ఆ వరం ప్రసాదించి అంతర్థానమవుతాను. నీ ప్రశ్నలకి సమాధానాలు చెప్పి తలనొప్పి వస్తోంది. ధర్మసూక్ష్మంగా ఇంతకంటే దగ్గరగా నీ కోరిక తీర్చలేను."

"నేను నేను"

"కుర్చీలో కూర్చుని ఏమిటా పలవరింతలు? ఇప్పనపాడు గ్రామ పంచాయితీ ఎలిమెంటరీ స్కూల్లో కంట్రాక్ట్ పద్ధతి మీద రెండో తరగతికి పాఠాలు చెప్పే మాస్టారు కావాలిట. మా తమ్ముడా ప్రెసెడెంట్‌గార్ని తీసుకొచ్చాడు, లేవండి" భార్య మాటలు విని గౌరీశంకర్ ఎమ్.ఏ. బి.ఇడి. ఈ లోకంలో పడ్డాడు.

విధివిలాసమనేదాంట్లో ఎంతటి విషాద హాస్యం?

---

## (గళ్ల) నుడి కట్టండి!

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | ■ | 3 | |
| 4 | ■ | | ■ | 5 | | ■ |
| 6 | | | ■ | ■ | ■ | 7 |
| | ■ | ■ | 8 | ■ | 9 | |
| ■ | 10 | 11 | | ■ | ■ | |
| 12 | ■ | | ■ | 13 | 14 | |
| 15 | | | | ■ | | ■ |

**పజిల్ చేరవలసిన తేదీ**
**16-07-2005**

**అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన వారిలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి 5 గురికి 3 నెలల పాటు ప్రియదత్త ఉచితంగా అందచేస్తాము**

## ఆధారాలు: కూర్పు : గుమ్మా ప్రసాదరావు

### అడ్డం

1. ఇది కాని చోట అధికులమనరాదు
3. తావలచింది
5. నదీజలాలు త్రాగుటకే కాదు దీనికీ కావాలి
6. కావున వారు మంచానికి దీన్నివాడుతారు
9. తెన్నుకి పర్యాయపదం, రెండింటిని కలసి వాడటం కద్దు
10. అడవి మధ్యమము ముందుకొస్తే అవి వెనక్కిపోతాయి
13. భేదము
15. పెండ్లి

### నిలువు

2. ఔను! దురుసుతనం నొసలు మీద కనబడుతోంది.
3. ఛాయ, కాంతి
4. తల్లి
7. సమీపం
8. సస్యరోగము
11. ఆశ్చర్యార్థకం తెలుపునది అచ్చు ఒకటి హల్లులు రెండు
12. పరిమళము
14. తటమేమరోలా

ఈ క్రింది కూపన్ పూర్తిచేసి దీనిని మీ జవాబుతో జతపర్చాలి.

పేరు.................................................................................

చిరునామా...........................................................................

..........................................పిన్‌కోడ్ :..........................................